ప్రియ పుత్రిక చిరంజీవి సౌభాగ్యవతి వాణికి ఆశీర్వాదాలు.

ఈ జాబు చదివేటప్పుడు నీకు విభ్రాంతి కలగవచ్చు. కలిగినా ఆశ్చర్యంలేదు. దీనిలో కొన్ని కఠోరమైన సత్యాలున్నాయి. అవి అంత రుచికరంగా ఉండవు. కాని, ఈ వయసులో ఇట్టి నిర్ణయం తీసుకొనడం ధర్మమనిపించింది; ధర్మమే కాదు శ్రేయస్కరం కూడా.

పుట్టినందుకు బాల్యకౌమారయౌవనావస్థలు దాటి వార్ధక్యం చేరుకొన్నాను. ఈ అవస్థల్లాంటివే నాలుగు ఆశ్రమాలున్నాయి. బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్యాసాలు. మొదటి రెండూ పూర్తి అయేయి. కుటుంబం వృద్ధి పొందింది. ప్రధానమైన బాధ్యతలన్నీ తీరేయి. సంసారంలో రసాలు అనుభవించడమయింది.

*"సంసార విషవృక్షస్య ద్వేఫలే అమృతోపమం।*
*కావ్యామృత రసాస్వాదః సజ్జన సంగమైస్సదా॥"*


అందుచేత వానప్రస్థాశ్రమం స్వీకరించేను. నేటి కాలానికి సరిపడేటట్లు ఆ ఆశ్రమ ధర్మాలు నిర్వచించుకొన్నాను.





# వానప్రస్థం

## వసంతరావు వేంకటరావు



మనిషికి దురంతమైన వ్యథ కలిగించేవి కామక్రోధాలు, రాగద్వేషాలు. ఈ రెండు జంటలను విడిచి పెట్టినప్పుడు నిజమైన మనశ్శాంతి కలుగుతుంది. మనశ్శాంతితో బాటు శరీరారోగ్యమూ బాగుంటుంది. కాగా, వానప్రస్థమంటే ఎక్కడికో పోయి ముక్కు మూ సుకోనక్కరలేదు. ఇంట్లోనే ఉండి కామక్రోధాలకూ, రాగద్వేషాలకూ ఏమాత్రం అవకాశమియ్యనటువంటి జీవన విధాన మవలంబించడం. అది కష్టతరమే. కాని, అభ్యాసంవల్ల సాధించవలసి ఉంటుంది.

ఈ ప్రణాళికలో మొదటి మెట్టు సంసార బంధాల నుంచి విముక్తి పొందడం. సంఘంలో కొన్ని ఆచారాలు అశాంతికి దారి తీస్తున్నాయని గమనించి కూడా వాటినుంచి బయట పడలేకపోవడం ఒక బలహీనతగా గుర్తించినప్పుడు కొంత మంచి జరుగుతుంది.

"ధనమూ ల మిదం జగత్." లేచింది మొదలు నిత్యావసరాలకు ఎప్పుడూ డబ్బు కావాలి. ఆ డబ్బు చేతిలో లేకపోతే కలిగేది మనోవ్యాధి. కాబట్టి ఇంటి విషయాలలో ఏ జోక్యం లేకుండా జీవించగల విధానం అవలంబించడం. నిత్య సంసార బాధ్యతలు మరొకరికి అప్పగించి ఆ బంధం తెంచుకొనడం. అదీ కష్టమే. అయినా అభ్యాసం.

ఆశ్చర్యమే అయినప్పటికీ, ధనాభావంవల్ల కలిగే వ్యథా, దైన్యమూ అనుభవించిన వారికే వాటి తీవ్రత తెలుస్తుంది. గత ఎనిమిదేళ్ళుగా నిత్యం హృదయంలో మెదులుతూన్నవి రెండు భావాలు. అవి వ్యక్తం చేసిన వ్యక్తి ఒక చక్రవర్తి హరిశ్చంద్రుడు. విశ్వామిత్రుడి అప్పు తీర్చే ప్రయత్నంలో అతను పడిన బాధలు వర్ణనాతీతం. నక్షత్రకుడు డబ్బు తెమ్మని వేధిస్తూంటాడు. రాజ్యం పోయింది. మాట తప్పకూడదు. ఆ స్థితిలో హరిశ్చంద్రు డంటాడు:

*"చావును లేమియున్ మనుజ సం*
*ంతతికిన్ వ్యసనంబు, లందులో*
*జావున సంభవించెడు వి*
*చారమణంగు దినక్రమంబులన్,*
*జీవుల కీ దరిద్రగతి*
*చే జనియించెడు ఘోర దుఃఖమో*
*దైవమ! జీవముల్ కలగు*
*దాక నశించక వృద్ధి చెందెడిన్."*

*"సరివారిన్నగుబాటు, పిమ్మట మన*
*శ్చాంచల్య రోగం బనం*
*తర మాహారము సం దనిష్ట, మటు మీ*
*దన్ దేహజాడ్యం, బటన్*
*మరణంబే శరణంబు పెక్కు దినముల్*
*మంచాన జీర్ణించి, యిం*
*తిరో! యీ ప్రాణులకున్ ఋణవ్యథల కం*
*టెన్ దుస్సహం బేదికన్!"*

(బలిజేపల్లివారి "సత్యహరిశ్చంద్రీయము")

ధనాభావంవల్ల నికృష్టంగా ప్రవర్తించవలసి వచ్చేది. మన సంప్రదాయాలూ, సాంఘిక ధర్మాలూ మంచివే. డబ్బున్న వారికెంత ఆనందం కలిగిస్తాయో ధనహీనుడికి అవి అంత బాధ, సంతాపమూ కలిగించగలవు. బంధుమిత్రుల ఇళ్ళలో ఏ శుభకార్యం జరిగినా ఏదో ఒక కానుక తీసుకొని వెళ్ళాలి కదా! జీవితంలో ఒక స్థాయికి అలవాటు పడ్డ తరవాత దాన్ని తగ్గించుకోవడం సాధ్యం కాదు. మరి, ఆ స్థాయికి అనుగుణమైన కానుకలు కొనే స్తోమత లోపించినప్పుడు చేసేదేముంది? ఏదో సాకు చెప్పి శుభకార్యాలకు హాజరు కాలేని పరిస్థితి సృష్టించుకోవడం. అదెంత ఆత్మవంచన! పర్యవసానంగా ఎంత మనోవేదన!

ఆదాయానికి మించిన వ్యయం కంటే వేరొక పాపం లేదు. ఆదాయం పరిమితమై వ్యయం దిన దిన ప్రవర్ధమానమైతే ఏం చేయడం? భూములు లేక, బాంకులో నిలవ లేక నిస్సహాయంగా ఉన్న స్థితిలో వెండి, బంగారాలు అమ్ముకోవడ మొక్కటే మార్గం. అది కొంత కాలం జరిగింది. ఒక్కొక్కటే వస్తువులు అంగడిలోకి దారి తీశాయి. అవి ఎంతవరకు పోయిందంటే క్రీడలలోనూ, నాటకాలలోనూ సంపాదించిన బహుమతులు, ప్రారంభోత్సవాలలో ఇచ్చిన వెండికత్తెరలు కూడా పోయాయి. తుదకు వాటి సంఖ్య పూజ్యమయింది. ఇంకేం చేయాలి?

పరిస్థితులు గమనిస్తూంటే ప్రకృతి నిర్దాక్షిణ్యం కొట్టవచ్చినట్లు కనిపిస్తూండేది. ఉద్యోగం నుంచి విరమించడంతో నెలసరి ఆదాయం శూన్యమయింది. ఇదివరలో రచనలవల్లా, రేడియో కార్యక్రమాలవల్ల కొంత సంపాదన ఉండేది. కాని, రిటైరు కాగానే ఈ రెండు ఆదాయాల తలుపులు మూ సుకొన్నాయి. ఎంతో ఆదరించే పత్రికలూ కూడా వైముఖ్యం చూపడం నమ్మలేని నిజమయింది. ఒకప్పుడు అనుకొనేవాడిని రచనలవల్ల బ్రతకవచ్చని. ఆ భావం నిజం కాదని నిరూపితమయింది. అయితే ఇది గ్రహాల అననుకూల్యమా?

ప్రకృతి కూడా మనిషిని కావాలని బాధిస్తుందా? అంటే, ఒక విషయం విను. వీథిలోకి బయలుదేరాలని బస్సుస్టాండుకు వెళుతూంటే ఒక్క నిమిషం తరవాత వరసగా గొలుసుకట్టుగా కొంప మునిగిపోతున్నట్లు బస్సులు దూసుకొనిపోతాయి. స్టాప్ చేరుకొనే లోపునే బస్సులన్నీ వెళ్ళిపోతాయి. మరో అరగంట దాకా బస్సులు రావు. ఈ విధంగా ఎప్పుడో జరగడం కాదు. ప్రతి రోజూ అదే వరస. వెక్కిరిస్తున్నట్లు, అవహాస్యం చేస్తూన్నట్లు, విజయం సాధించినట్లు చూస్తూండగా పరుగెత్తిపోయే బస్సులను ఏమనాలో తెలియదు. ఒకవైపు పోవాలని నిలబడితే, రెండోవైపు పోయే బస్సులు అయిదారు

రావడం, అవసరమైన బస్సు ఒక్కటీ అరగంట దాకా రాకపోవడం. ఇవన్నీ స్వల్ప విషయాలుగా తోచవచ్చు కాని, నిర్దాక్షిణ్యమైన ప్రకృతిలీలలు కాబోలు!

ఈ అసాధారణమైన పరిస్థితులలో నిస్సహాయంగా ఊరుకోవడం చేటనిపించింది. దశాబ్దాలుగా సరస్వతిని ఆరాధిస్తూనే ఉన్నాను. లక్ష్మిని కూడా ఆరాధించినా అది ఫలించలేదు. జీవనపథంలో ఘర్షణ ఎక్కువ అవుతూన్న కొద్దీ, లక్ష్మి తిరస్కరిస్తున్న కొద్దీ సరస్వతిమీద భక్తి ఎక్కువ కాజొచ్చింది. దాని కొక కారణ మనుకొంటాను.

లక్ష్మీ సరస్వతులకు సామరస్యం లేదంటారు. ఎంతోమంది గొప్ప కవులు వారి చివరి కాలంలో లక్ష్మీవిదూరులై యమయాతన పడినట్లు చదువుతాము. ఒక్కసారి లక్ష్మీ సరస్వతుల పటాలు చూడు. ఈనాటి చిత్రకారులు చిత్రించేవి కావు సుమా! సంప్రదాయసిద్ధంగా వస్తూన్న వాటిలో సరస్వతీదేవి వీణాపాణి అయి సుఖాసీనగా ఉంటుంది. లక్ష్మీదేవి నిలబడే ఉంటుంది. ఆ నిరూపణలో గొప్ప సత్యం అంతర్యాతమై ఉంది. సంపాదించిన చదువూ, జ్ఞానమూ ఎప్పుడూ తగ్గవు. కాలంతో బాటు అవి పెరుగుతూనే ఉంటాయి. ఇక, ఆర్జించిన ధనం నిత్యం ఖర్చవుతూనే ఉంటుంది. ఏ విధంగా జరిగిన వ్యయమైనా పూడ్చడానికి ప్రయత్నించకపోతే లక్ష్మి క్షీణించిపోతుంది. దానంచేసే వాడి ధనం తగ్గుతూండగా, విద్యాదానం చేసిన వాని జ్ఞానధనం పెరుగుతూ ఉంటుంది. ఇస్తే తరిగేది ధనం, ఇస్తే పెరిగేది విజ్ఞాన ధనం. అందుకే సరస్వతి సుఖాసీన. లక్ష్మి నిలబడే ఉంటుంది. ఎప్పుడు నిర్గమిస్తుందో తెలియదు. సరస్వతీ దత్తజ్ఞాన ధనం స్థిరమై దృఢమైనది, లక్ష్మీ దత్తధనం చంచలమైనది.

ఈ కారణాల చేత పరిస్థితులను అధిగమించడానికి నేను తీసుకొన్న నిర్ణయం సహకరిస్తుంది. ఉన్న జ్ఞానం పోదు, లేని ధనం రాదు. కాగా, ధన భావాన్ని విసర్జిస్తే సంకటమే లేదు కదా! అందుకని, ఇంటి బాధ్యతలు తరవాతి తరంవారికి అప్పచెప్పి, డబ్బు ఊసే తలపెట్టనవసరం లేకుండా, స్వార్థాన్ని త్యజించి పరార్థానికి కృషి చేయ నిశ్చయించాను.

## ప్రకృతిపంచే సమతూకం

పుణ్యానికి ఓ గుడ్డని దానం ఇస్తే అది గోచీకి ఎక్కువ. అంగోస్త్రానికి తక్కువ అని వాపోయాడట ఓ పెద్ద మనిషి. అతివృష్టి ఉన్నా కష్టమే అనావృష్టి అయినా కష్టమే. ఏదైనా సమతూకంలో ఉంటేనే దానికి అర్థవంతమైన ప్రయోజనం ఉంటుంది. ఈ విషయం మనకి ప్రత్యక్షదైవమైన సూర్యభగవానుడికి కూడా తెలుసుననుకోవాలి.

భూమిమీద సకల ప్రాణికోటికీ ఆధారం సూర్యుడన్న విషయం తెలిసినదే. సూర్యుని నుంచి నిరంతరం అనంత పరిమాణంలో శక్తి వెలువడుతుంటుంది. ఇందులో కేవలం రెండు వందల కోట్లలో ఒకభాగం మాత్రమే మన భూమిని చేరుతుంది. మిగిలిన దాంట్లో అత్యధిక భాగం శూన్యంలోకి ప్రసారమైపోతుంది. మరి కొంతదాన్ని భూమ్యాదిగ్రహాల వాతావరణాలు మింగేస్తాయి. విచిత్రమేమిటంటే మన భూమిని జేరే శక్తి ప్రాణికోటి మనుగడకి ఎంత అవసరమో అంతే ఉంటోంది. మనకి వచ్చే శక్తిలో కేవలం 13 శాతం తగ్గితే భూమిపై భాగమంతా ఒక కిలోమీటరు మందానికి పైగా మంచు పేరుకిపోయి సకల ప్రాణికోటి నశిస్తుంది. ఈ శక్తే మూడవవంతు పెరిగినా భూమి మీద ప్రాణులు మంగలంలో వేగినట్లు మలమలమాడి అంతరించిపోతాయి.

-కె. ఆర్. కె. మోహన్

వానప్రస్థంలో అది రెండో భాగమని గమనించు.

లక్ష్మీకటాక్షం ఆగంతుకంగా కలగవచ్చు. లాటరీలో లక్షలు రావచ్చు. వచ్చినా ఆ లక్షలు నిలుస్తాయనీ, సుఖాన్నిస్తాయనీ హామీలేదు. ఒకసారి సరస్వతీ కటాక్షం కలిగిందా దానికి తిరుగులేదు, తరుగు లేదు. అయాచితంగా అభివృద్ధి పొందుతూనే ఉంటుంది.

లక్ష్మీ పుత్రులతో పోలిస్తే సరస్వతీ పుత్రుల సంఖ్య ఎక్కువే, సరస్వతీ పుత్రులు జ్ఞాన వ్యాప్తికి పూనుకొంటే కాని నిరక్షరాస్యత తగ్గదు. ప్రయోజన విద్యా ప్రమాణం పెరగదు. భారతీయ సంస్కృతీ ప్రచారం అవిచ్ఛిన్నంగా సాగదు. అటువంటి కృషి చేసే అర్హత సరస్వతీ పుత్రులకు మాత్రమే ఉంది. వారు పెట్టే భిక్ష ఉభయతారకంగా ఉంటుంది. అందులో ఆత్మానందమూ ఉంది. కాబట్టి, ఈ వానప్రస్థాశ్రమంలో సరస్వతీ సేవకు అంకితమవుతాను.

ఇంకో ముఖ్య విషయం గమనించు. అన్ని బలాలూ ఉడిగే వృద్ధాప్యంలో, స్వతంత్ర జీవనం కష్టమైనప్పుడు ఆదుకొనేవారు కొడుకులు అనే సత్యం లోకప్రసిద్ధం. అందుకే పిల్ల పుట్టగానే కొడుకంటే సంతోషించడం, కూతురంటే మొగం వాల్చడం ఇప్పటికే జరుగుతూనే ఉంది.

పెద్దలన్నారు:

*'ఉత్తమం స్వార్జితం విత్తం, మధ్యమం పితురార్జితం।*


*అధమం భ్రాతృవిత్తంచ, స్త్రీ విత మధమాధమం॥'*

ఈ శతాబ్దికి ముందు స్త్రీలు బడులలో చదివేవారు కారు. అందుచేత వారికి ఉద్యోగ ప్రసక్తి లేదు. స్వతంత్రంగా ఆర్జించే అవకాశం లేదు. ఆర్థికంగా స్త్రీ పరాధీనగా ఉండేది. ఆస్తిలో భాగానికి అర్హతలేదు. అయితే వివాహ సమయంలో "స్త్రీ ధనం" కొంత ఇచ్చేవారు. అందుచేత "స్త్రీ విత్త మధమాధమం" అన్నారు. ఆ సూక్తి ఆనాడు చాలా అర్థవంతమైనదే.

ప్రస్తుత కాలంలో పురుషులతో సమానమైన హక్కులకై స్త్రీలు పోరాడుచున్నారు. సంఘంలోను, చట్టాలలోను మార్పులు వస్తున్నాయి. ఈనాడు ఆస్తిలో స్త్రీకి హక్కుందని ప్రభుత్వం శాసించింది. స్త్రీలు విద్యావతులై ఉద్యోగాలు చేసి స్వార్జితం పెంపొందించుకొంటున్నారు. వీటి పర్యవసానం చూడు. ఎట్టి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయో!

చదివించడానికి కొడుకు కోసం చేసే ఖర్చంత ఖర్చు కూతురి విషయంలో కూడా చేయాలి. వివాహమప్పుడు యథా ప్రకారంగా కట్నం ముట్టచెప్పాలి. ఎంత చదువుకొన్న పిల్లకైనా కట్నం లేకుండా పెళ్ళి కాదు. చట్టాల మాటకేమి? మరో చిత్రం. చదువు ఎక్కువైన కొద్దీ కట్నం ఎక్కువ చెల్లించవలసి వస్తోంది. ఈనాటి పరిస్థితులలో ధన వ్యయపరంగా చూసుకొంటే ఒక కూతురు ఇద్దరు కొడుకులకు సమానం. అటువంటప్పుడు 'స్త్రీ విత్త మధమాధమం'ను 'స్త్రీ విత్త ముత్త మోత్తమం'గా మార్చడం సబబు కాదా! ఈ వ్యాఖ్య చాలా దూరం పోతుంది. కొత్త భావాలకు తావిస్తుంది.

వివాహమైన తరవాత స్త్రీ అత్తవారింటికి పోతుంది. భర్తతో జీవిస్తుంది. స్త్రీ జీవితంలో ఎంత మార్పు! ఇంటి పేరు మారుతుంది. గోత్రం మారుతుంది. ప్రేమానురాగాలు మరోవైపుకు మళ్ళుతాయి. అంతవరకు పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రుల స్థాయి తగ్గుతుంది. బాధ్యతా క్రమంలో మొదటిది అత్తవారిని సుఖపెట్టడం. తరవాత పుట్టింటి సంగతి. ఇది సహజ పరిణామం. కాదనడం ఆత్మవంచన. విద్యాధికులై ఉద్యోగం చేస్తూన్నంత మాత్రాన అత్తింటి బాధ్యతల నుంచి తప్పించుకోవడం సాధ్యం కాదు, మంచిదీ కాదు. అయితే, విద్యార్హత పొందడంవల్ల, ఇదివరలో లేని పుట్టింటి బాధ్యత ఇప్పుడు కొంతవరకైనా వహించవలసి వస్తుంది. కొడుకులా విద్యాభ్యాసానికి తండ్రి వెచ్చించిన ధనానికి ప్రతిఫలం ముట్టచెప్పవలసిన ధర్మం ఈ పరిస్థితులలో కొత్తగా ఏర్పడింది. అది



కాదనడానికి వీలులేదు. అయితే, ఆర్జనలో పెద్దపాలు అత్తింటి పాలు చేసి, కొద్దిగానైనా పుట్టింటికి కేటాయించడం కనీస ధర్మం. ఆ ధర్మాన్ని పురస్కరించుకొని, ప్రతి నెల బాధ్యతాయుతంగా నాకు కొంత పంపడం నీ విధి. మరిన, మారుతూన్న పరిస్థితులలో కొత్తగా ఉత్పన్నమైన ధర్మ మిది. అందుకే నేను 'స్త్రీ విత్త ముత్త మోత్తమం' అన్నాను.

ఈ శ్లోకంలో మరో విశేషం గమనించావా? అందులో స్వార్జితం, తండ్రి ఆర్జన, అన్నదమ్ముల ఆర్జన, స్త్రీ విత్తం ఉన్నాయే కాని కొడుకుల ఆర్జన గురించి చెప్పలేదు. తల్లిదండ్రులను కొడుకులు పోషించాలి అన్నది ప్రకృతి సిద్ధం. పారంపర్యంగా వంశం వృద్ధి చెందుతూ ఉండాలంటే తండ్రి కొడుకులకు ఆ సంబంధం దృఢంగా ఉండాలి. అందుకే పుత్రుణ్ణి గురించి ప్రత్యేకించి చెప్పవలసిన అగత్యం లేదు.

ఇప్పటి నా పరిస్థితులలో కనీసపు కోరికతోనైనా కలత లేకుండా జీవించడానికి నా నెలసరి ఆదాయం చాలదు. అందుచేత ఆర్జనలో కొంత భాగం అపేక్షించక తప్పలేదు. ఆ అపేక్ష తప్పా, ఒప్పా అని సుదీర్ఘ చర్చలు మానసికంగా ఎంతో కాలంనుంచి చేసుకొంటున్నాను. నేటి ప్రమాణాల బట్టి నా అపేక్ష తప్పు కాదన్న దృఢవిశ్వాసం కలిగింది. దాన్ని మన్నించడం నీ ధర్మమనీ స్పష్టమయింది. ఆ ధర్మానికి కట్టుబడతావనీ, ధర్మ నిర్వహణకు పూనుకొంటావనీ ఆశించు

నీ

నాన్న."

** ** **


"ప్రియమైన నాన్నగారికి నమస్కారములు.

మీ జాబు చదువుతూన్నంత సేపూ భరించలేని ఆవేదన కలిగింది. తమాయించుకోవడం చాలా కష్టమైంది. మీ రింత కఠోరమైన నిర్ణయానికి రావడం మీకు మంచిదేమో కాని, మాకు బలహీనత కలిగించింది.

గత ఎనిమిదేళ్ళలో మీ రంత శ్రమపడవలసిన అవసర మేముంది? మీరు బాధపడుతున్నారన్న అనుమానమైనా కలగనీయని విధంగా మీ జీవనం గడిపారు. మీ బాణీలో ఏ మార్పూ రాలేదు. మీ రసలు మనోవేదనతో కుందుతున్నారని అనుమానించడానికైనా వీలులేని విధంగా మీ నిత్యకృత్యాలు జరిపేవారు. మనస్సుకు ముఖం అద్దం అంటారు. మీరు ఇన్నేళ్ళుగా ఆ నానుడిని విజయవంతంగా వమ్ము చేశారు. మీ ముఖంలో మాకెన్నడూ విషాదచ్ఛాయలైనా కనిపించలేదు. మీరు నాటకాలు ఆడటమే కాదు, జీవిత రంగంలో గొప్ప నటకులని నిరూపించుకొన్నారు. మీ మనస్థితిని తెలుసుకోడానికి మా కాధారభూతమయేవి మీ ప్రవర్తన, ముఖ కవళికలు. మీ బాధను అంత విజయవంతంగా మరుగుపరిచారని తెలిసినప్పుడు మాకెంత తీవ్ర మానసిక సంచలనం కలిగి ఉంటుందో ఊహించారా? 'శాసించ' వలసిన మీరు 'అర్థించడం' ఏమిటి? మా ఋణంలో కొంతైనా తీర్చుకొనే అవకాశ మిప్పటికైనా ఇచ్చినందుకు ఆనందిస్తున్నాను.

ప్రేమతో

—మీ వాణి."



® మార్కెట్ చేయువారు: ... బొంబాయి 400 001.
88 277 Tl.